క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మేలు

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన గౌతమ్‌కుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీ పత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి చేతులమీదుగా గౌతమ్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు గరిక సుధాకర్, మేకల ముత్యంరెడ్డి, రాజు, శివ ఉన్నారు.

సఫిల్‌గూడ రైల్వే గేట్ వద్ద టన్నెల్ ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: సఫిల్‌గూడ రైల్వేగేట్ వద్ద టన్నెల్ ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ సఫిల్‌గూడ రైల్వే గేట్ మూసి వేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. రైల్వే గేట్ తెరిచే అవకాశం లేకుంటే టన్నెల్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని జీఎంను కోరామన్నారు.

మహిళాదినోత్సవ వేడుకలు

కాప్రా: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎస్‌రావునగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి హాజరయ్యారు. మహిళామండలి అధ్యక్షురాలు కమల, జనరల్ సెక్రటరీ నిర్మల, సభ్యులు రంజన మలాట్కర్, సువర్ణ, రమాదేవి, రాధ పాల్గొన్నారు.

బ్యూటిఫుల్ లేక్..

- పీర్జాదిగూడలో గూడెం పెద్ద చెరువు సుందరీకరణకు శ్రీకారం
- రూ.13 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- మినీ ట్యాంక్ బండ్‌ను తలపించేలా చకచకా ఏర్పాట్లు



చెరువు సుందరీకరణ నమూనా

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో శంకర్‌నగర్ కాలనీని ఆనుకొని ఉన్న గూడెం పెద్ద చెరువు సుందరీకరణకు అధికారులు, పాలకవర్గం శ్రీకారం చుట్టింది. రూ.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టి మినీ ట్యాంక్‌బండ్ తరహాలో పనులు చేపట్టారు. ఆహ్లాదంతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇచ్చేలా రూపుదిద్దుకుంటోంది. పనులు పూర్తయితే ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపే విధంగా రూపొందిస్తున్నారు. అంతేగాకుండా పిల్లలు, పెద్దలు ఆటలు ఆడుకునేందుకు క్రీడా సామాగ్రిని ఏర్పాటు చేయనున్నారు. మురుగు నీరు చెరువులోకి రాకుండా చేసి, పచ్చని చెట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పనులను త్వరతిగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

28 ఎకరాల విస్తీర్ణంలో చెరువు..

గూడెం పెద్ద చెరువు సుమారు 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. రూ.13 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్ తరహాలో పనులు చేపట్టారు. రూ.5 కోట్లతో రిటర్నింగ్ వాల్, రూ.8 కోట్లతో బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నారు. బతుకమ్మ ఘాట్, దసరా ఉత్సవాలు జరుపుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు, స్వాగత తోరణం, పిల్లలకు ప్లే ఏరియా, ఓపెన్ ఎయిర్ జిమ్, వ్యూ పాయింట్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. హైమాస్ట్ లైట్లను అమర్చనున్నారు. అంతేగాకుండా వివిధ రకాల పూల మొక్కలతో గార్డెన్‌ను అభివృద్ధి చేయనున్నారు. పచ్చని చెట్లు ఉండే విధంగా రూపొందిస్తున్నారు. అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ చెరువును సుందరీకరిస్తున్నారు.

నాడు మురికి కూపంగా..

గతంలో గూడెం పెద్ద చెరువు ఓ పెద్ద మురికి కూపంగా ఉండేది. ఎగువ ప్రాంతాల్లోని మురుగు, వర్షపు నీరు వచ్చి ఈ చెరువులో చేరేవి. చెరువును ఆనుకుని ఉన్న 10 కాలనీల ప్రజలు నిత్యం నరకాన్ని చూసేవారు. ఇక్కడ ప్రజలు నిత్యం అనారోగ్యానికి గురి కావడంతో పాటు విపరీతమైన దోమల బెడదను ఎదుర్కొనే వారు.

నేడు సుందరీకరణ దిశగా..

పెద్ద చెరువుకు నేడు సుందరీకరణ దిశగా అడుగులు పడ్డాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి రాకుండా ప్రత్యేకంగా కాల్వ తీసి మూసీలో కలిపే విధంగా రూపొందించారు. ప్రస్తుతం 20 రోజుల నుంచి దోమలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టారు. ఈ సుందరీకరణతో దోమల బెడద నుంచి విముక్తి లభించనుంది.



జోరుగా సాగుతున్న పనులు



స్వాగత తోరణం

ప్రజల అభిరుచులకు అనుగుణంగా..



పీర్జాదిగూడ నగర ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఈ చెరువును సుందరీకరిస్తున్నాం. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చెరువులో మురుగు నీటిని తొలగించి, మురుగు నీరు రాకుండా ప్రయత్నించాయి. కానీ ఆ ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అన్ని రకాల పనులు చేపడుతున్నాం. ఈ సుందరీకరణ పనులు పూర్తయితే ట్యాంక్ బండ్‌ను తలపించే విధంగా ఉంటుంది. అధికారులు, పాలకవర్గం కలిసి త్వరతిగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాం.

– జక్క వెంకట్‌రెడ్డి, మేయర్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థ

వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్‌లోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్, సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నగేష్, శేఖర్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి ఆర్థికసాయం

కుషాయిగూడ: కాలేజీ ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న ఇంటర్ విద్యార్థి నితిష్‌కు బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నతికి బీఎల్ఆర్ ట్రస్టు పాటుపడుతోందన్నారు.

అసిస్టెంట్ మేనేజర్‌గా రజిత



కాప్రా: కుషాయిగూడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా రజిత బాధ్యతలు చేపట్టారు. చెంగిచెర్ల డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన ఆమె కుషాయిగూడ డిపోనకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

‘ఆశాజ్యోతి’లో ఐటీ సోదాలు

అల్వాల్: రాష్ట్ర వ్యాప్తంగా ఐటీ సోదాలు కొనసాగుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలోని అల్వాల్‌లో ఐటీ సోదాలు బుధవారం జరిగాయి. క్రిస్టియన్ మిషనరీ సంస్థ అయిన ఆశాజ్యోతి ఫౌండేషన్‌కు సంబంధించి కార్యాలయాలు, నిర్వాహకుల ఇళ్లపై ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. పాత అల్వాల్‌లోని భూపతిరావునగర్‌లోని ఆశాజ్యోతి సంస్థ నిర్వాహకులైన సాజి కె.జాన్ ఇంటితో పాటు మచ్చబొల్లారంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

కార్మికులకు అండగా ఉంటాం..

కుషాయిగూడ: 8 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న చర్లపల్లి పారిశ్రామికవాడలోని గోదావరి పాలిమర్స్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటామని ప్రేరణ ఫౌండేషన్ చైర్మన్ శరత్ సుదర్శి అన్నారు. కార్మికులకు ఫౌండేషన్, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. బిందు తాడివాక, శ్రివ్యాల్ ఉయ్యూరి, మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, వెంకటేశ్వరరావు, గోపి, హేమలత, రాజు ఉన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

బోడుప్పల్: పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్‌కు చెందిన నారాయణ అవధాని హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును బుధవారం ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు బుర్ర దత్తాత్రేయ శాస్త్రి, బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి



ఏఎస్‌రావునగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించారు. ఏఎస్‌రావుగనర్‌లోని కాప్రా–మల్కాజ్‌గిరి సర్కిళ్ల సరిహద్దు ప్రాంతంలోని కాలనీవాసులు డ్రైనేజీ సమస్యతో కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలు బేతాళ బాలరాజు, గరిక సుధాకర్, రాంచందర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, యాదగిరి, కాలనీవాసులు రాజేశ్వరరావు, రాంమూర్తి, చంద్రకుమార్, కృష్ణమూర్తి, సోమాచారి, విజయ కుమార్, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాలతో మానవ వనరుల అభివృద్ధి

ఉప్పల్: అధునాతన శిక్షణతో మానవ వనరుల అభివృద్ధి ఉపయోగమని కోల్‌కతాకు చెందిన ప్రొఫెసర్ సోమనాథ్‌దాస్‌గుప్తా అన్నారు. సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐలో అనాలిటికల్ జియోకెమిస్ట్రీపై ముగింపు శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో ఎర్త్‌సైన్స్‌లోని వివిధ అంశాలపై పనిచేసేందుకు అధునాతన విశ్లేషనాత్మక సాధనాలు లేవన్నారు. ఈ సాధనాలు మినరల్ ఎక్స్‌ప్లోరేషన్‌లో ఉపయోగపడుతాయని, మాతృభూమి, దాని నిర్మాణాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, సిబ్బంది డాక్టర్ శ్రీనివాస్ శర్మ, డాక్టర్ ఎం.రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే దీక్షలే..

బోడుప్పల్: బోడుప్పల్ నుంచి చిలుకానగర్ వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బుధవారం బోడుప్పల్ బీజేపీ ఉపాధ్యక్షుడు మాడుగుల శివ యాదవ్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డంతా గుంతలమయంగా మారిందని, రాకపోకలు సాగించడంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో కోరారు. రోడ్డు పనులు చేపట్టకపోతే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. జైకిషన్, సతీష్, హరిపాల్‌రెడ్డి, పాకగిరి తదితరులున్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

గ్రామదేవతలను పూజిస్తే దుష్టశక్తులు దూరం

రామంతాపూర్: గోకుల్‌నగర్ కాలనీలోని ఊర పోచమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న 14వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఛండీ హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ కక్కిరేని చేతన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, మహంకాళి, మైసమ్మ అమ్మవార్లను పూజిస్తే దుష్టశక్తులు దూరమవుతాయన్నారు. దేవాలయ చైర్మన్ కక్కిరేని హరీష్ ఉన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..

కుషాయిగూడ: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మంగాపురం కాలనీలో కొనసాగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పైప్‌లైన్ పనులు పూర్తయితే మంగాపురం కాలనీవాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. దశలవారీగా డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటర్‌వర్క్స్ ఏఈ వేణుగోపాల్, మోహన్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



మౌలాలిలో కాంగ్రెస్ జోడో యాత్ర

మౌలాలి: డివిజన్ ఉల్ఫత్‌నగర్, హనుమాన్‌నగర్, కృష్ణానగర్, శివాజీనగర్, ఆర్టీసీ కాలనీలో బుధవారం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో జోడో యాత్ర కొనసాగింది. నాయకులు ఉమామహేశ్వరి, వినోదయ్‌యాదవ్, అరుణ్‌గౌడ్, వంశీ ముదిరాజ్, అమిద్, హైదర్, నర్సింహ, ముక్తర్, భాగ్యరాణి, చంద్రకళ, ఆషారాణి, అన్నమ్మ, సలీమ్, శ్యామ్, క్రాంతి, థామస్, హైమద్, కిరణ్, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి, ఉమేష్‌సింగ్, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌ముదిరాజ్ ఉన్నారు.

నాణ్యతలో రాజీవద్దు..

మేడిపల్లి: పీర్జాదిగూడ కమాన్ నుంచి ప్రతాప్‌సింగారం క్రాస్ రోడ్డు వరకు చేపట్టిన నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగం పెంచాలని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సుమారు రూ.26.32 కోట్లతో కొనసాగుతున్న పనులను అధికారులతో కలిసి మేయర్ బుధవారం పరిశీలించారు. నాణ్యతలో రాజీపడకుండా పూర్తి చేయాలన్నారు.



రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షిస్తూ..

సమస్యలకు పరిష్కారం



మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయనగర్‌లో బుధవారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. పలువురు అభ్యంతరాలు తెలపడంతో సిబ్బందికి ఆమె సూచనలు చేశారు. జీహెచ్‌ఎంసీ ఏఈ సత్యలక్ష్మీ, బీజేపీ నాయకులు సంతోష్, ఓంప్రకాష్, శంకర్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్ ఉన్నారు.

ఏడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డా పట్టదా..?

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వక్ఫ్ బోర్డు బాధితులకు న్యాయం చేయాలని జేఏసీ కో చైర్మన్ కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బోడుప్పల్ గాంధీ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 17వ రోజుకు చేరిన సందర్భంగా వారు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తప్పిదాల వల్ల ఏడు వేల కుటుంబాలు రోడ్డు పడ్డాయన్నారు. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 18వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టేందుకు జేఏసీ సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు. దీక్షలో వివిధ కాలనీలవాసులు కూర్చున్నారు.



దీక్షల్లో కూర్చున్న వివిధ కాలనీవాసులు

చిన్నారులూ.. వీధి కుక్కలతో జాగ్రత్త

కాప్రా: వీధి కుక్కల దాడిలో స్కూల్ పిల్లలే గాయాల పాలవుతున్నారని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ యూపీఎస్ స్కూల్‌లో బుధవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వీధి కుక్కల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధి కుక్కల పట్ల స్కూల్ పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుక్కలు దాడి చేస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ స్వప్నారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, ఎస్ఎఫ్ఏ ఆరోన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు ‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలి

అల్వాల్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. అల్వాల్ మండలం పార్టీ ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని బుధవారం ధర్నా కార్యక్రమం చేట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలన్నారు. ఏప్రిల్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 171లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని స్థలం కబ్జా అవుతుందని, అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కొకూర్ బర్షిపేటలో సర్వేనగర్ 27లో చెరువును కబ్జా చేస్తూ భూకబ్జాదారులు అమ్ముకుంటున్నారని తెలిపారు. పార్టీ నాయకులు సాయిగౌడ్, సహదేవ్, కృష్ణమూర్తి, శంకర్, యాదయ్య, సల్మాన్‌బేగ్, చంద్రయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు